



నంద్యాలలో నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్

పోలింగ్ కేంద్రాలకు నాడు-నేడు నిధులా?

- పాఠశాలల హెచ్‌ఎంలే చూసుకోవాలని ఆదేశం
- ఇది తమ బాధ్యత కాదంటున్న హెచ్‌ఎంలు
- ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 30 :

ఎన్నికల వాతావరణం ముసురుకుంటోంది. ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన మొదలైన వాటి మీద అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలల్లో పోలింగ్‌కు అవసరమైన మౌలిక వసతులు హెడ్‌మాస్టర్లే చూసుకోవాలని, నాడు-నేడు నిధులు వినియోగించమని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మన బడి నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-3 స్కూళ్లకు విడుదల చేసిన స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (ఎస్‌ఎంఎఫ్)నుంచి వాడుకోమని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు కూడా రాని స్కూళ్ల హెడ్‌మాస్టర్లు అందుబాటులో ఉన్న ఇతర నిధులను ఖర్చు చేయాలని కూడా చెప్పారు. దీని మీద ప్రధానోపాధ్యాయులు భగ్గుమంటున్నారు. అసలు ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ల కింద పైసా ఇవ్వలేదు. నాడు-నేడు 2వ విడత పనులు చేస్తున్న స్కూళ్లకు ఇచ్చిన నిధులు ఖర్చయిపోయాయి. అలాంటప్పుడు ఖాతాల్లో నిధులు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. నిధులు లేవని అంటే ఎట్లా అయినా చేయాల్సిందే అని, లేకుంటే ఊరుకోమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, మండల పరిషత్ ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 1265 ఉన్నాయి. వాటిల్లో 90 శాతం బడుల్లో పోలింగ్ కేంద్రాలు నిర్వహిస్తారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి నెలాఖరుకల్లా పనుల పూర్తి చేయాలని ఆదేశిస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రావడంతో హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి పాఠశాలలో దివ్యాంగుల కోసం రెయిలింగ్, ర్యాంప్‌ల నిర్మాణాలు చేపట్టాలని, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటివి పక్కాగా ఏర్పాటు చేయాలని, కిచెన్‌షెడ్లు ఆ వ్యవధిలోపు పూర్తి కావాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పన ముఖ్యం. ఎన్నికల విధి నిర్వహణకు వచ్చే ఉద్యోగులకు వంటలు వండించేందుకు భోజనశాలల్ని ఆలోగా పూర్తి చేయాలి. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లకు నిధులను ఎన్నికల సంఘం విడుదల చేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నాడు నేడు పథకం కింద ఖర్చుపెట్టాల్సిన నిధులతో పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు త్వరగా చేయాలని ఆదేశించింది. పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన నిధులను పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లకు వెచ్చించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడాన్ని ప్రధానోపాధ్యాయులు తప్పుపడుతున్నారు.

కాంపోజిట్ గ్రాంట్లు లేనట్లే

ఈ ఏడాది పాఠశాల కాంపోజిట్ గ్రాంట్స్ కింద పైసా కూడా రాలేదు. ఇప్పట్లో ఆ గ్రాంట్ వచ్చే దాఖలాలు కూడా కనబడటంలేదు. ఎవరైనా హెడ్ మాస్టర్లు తమ జేబుల్లోంచి స్కూల్ నిర్వహణకు వెచ్చించి ఉంటే వాటిని ఇప్పటికిప్పుడు తిరిగి ఇచ్చే పరిస్థితి కూడా లేదు. పాఠశాల నిర్వహణకు నిధులు అవసరమైతే నాడు-నేడు నిధుల నుంచి కేటాయించుకోమని అంటున్నారేగాని అసలు ఏ పాఠశాలల్లోనూ నాడు-నేడు నిధులు మిగల లేదు. అవి చాలకే చాలా పాఠశాలల్లో నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. చాలా మంది హెచ్‌ఎంలు చివరి దశల్లో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు సొంత డబ్బు వెచ్చించిన ఘటనలు లేకపోలేదు. ఆ బిల్లులు రాకపోతే ఆ మేరకు తాము నష్టపోయినట్లేనని ఆవేదన చెందుతున్నారు. ఇది ఇలా ఉండగా పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పనకు పాఠశాల విద్యాశాఖ యంత్రాంగం ఖర్చు పెట్టడం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు ఏదో ఒక పద్దు కింద నిధులు విడుదల చేయించాలని కోరుతున్నారు.



నల్లవాగుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల

రెవెన్యూ శాఖ వ్యవహారం

పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పన అంశం పూర్తిగా రెవెన్యూ శాఖకు సంబంధించింది. ఆ శాఖ ఆధ్వర్యంలోనే ప్రతి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చేయడం గత కొన్నేళ్లనుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈసారి అందుకు భిన్నంగా పాఠశాల విద్యాశాఖను ఏర్పాట్లు చేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఆ నిధులతో పాఠశాలల్లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుండేది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేసేవారు. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రెయిలింగ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించడంతో ఈసారి ఆ పనుల నిర్వహణకు తాపీ మేస్త్రీలను తామే సమకూర్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంలపై భారం సరికాదు



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లుకు నాడు - నేడు నిధుల నుంచి హెచ్‌ఎంలు ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదు. నాడు - నేడు పనులకు నిధుల కొరతతో ప్రభుత్వ పాఠశాలలోని నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోతే ఎక్కడి నుంచి నిధులు తీసుకొచ్చి వసతులు కల్పించాలంటూ హెచ్‌ఎంలపై భారం మోపడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి.

- నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీఎఫ్

ఎన్నికల సంఘం నిధులను వినియోగించాలి



నిధుల లేమితో నాడు - నేడు పనులు కుంటుపడ్డాయి. అయితే పోలింగ్ కేంద్రాలు ఉండి నాడు - నేడు పనులు జరుగుతున్న పాఠశాలల నిధుల నుంచి ఎన్నికల నిర్వహణకు హెచ్‌ఎంలు ఖర్చు చేయాలంటూ జీవో జారీ చేయడం అవివేకం. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిధులను రెవెన్యూ శాఖ ఉపయోగించి ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- జి.సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీపీఎఫ్

పనులు జరుగుతున్నాయి

పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ఇటీవలే నిధులు విడుదలయ్యాయి. అన్ని వసతులను పూర్తి చేసి సిద్ధం చేస్తాం.

- లలితమ్మ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి, సమగ్ర శిక్ష, నంద్యాల

సైకో జగన్‌ను సాగనంపుదాం

- టీడీపీతోనే బీసీల అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి



'జయహో బీసీ'లో ఐక్యత చాటుతున్న టీడీపీ, జనసేన నాయకులు

వెలుగోడు, జనవరి 30: రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన సైకో జగన్‌ను ఇక ఇంటికి సాగనంపుదామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం వెలుగోడు పట్టణంలోని పాతబస్టాండు ఆవరణలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు నెలలు టీడీపీ విజయం కోసం కష్టపడాలన్నారు. టీడీపీకి మొదటి నుంచి బీసీలు అండగా ఉన్నారన్నారు. ఒక్క అవకాశం ఇస్తే జగన్ రాష్ట్రాన్ని అప్పుల మయం చేశాని, మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తాడని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో సీఎం జగన్ ఫుట్‌బాల్ ఆడుతున్నారని ఎద్దేవ చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయిస్తూ రాష్ట్రంలో రౌడీరాజ్యం కొనసాగిస్తు న్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు కల్పించి వారికి సముచిత స్థానం కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. సొంత తల్లి, సోదరికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం, శేషిరెడ్డి, రసూల్, హిదాయత్, రామనాయుడు, జాకీర్, వజీర్, తిరిపాల్‌బాబు, జిల్లెల్ల శ్రీరాములు, క్రిష్టారెడ్డి, రఘుస్వామిరెడ్డి, జనసేననాయకులు శాలు బాషా, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, జనవరి 30: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో అక్రమ కేసు బనాయిస్తే సుప్రీం కోర్టులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ సుప్రీం కోర్టు కొట్టివేయడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు నమోదు చేయించి మరో పక్క ప్రజా ధనాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినప్పటికీ ప్రజలు చంద్రబాబు వెంట ఉన్నారని రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. సీఎం జగన్ వైఫల్యాలను రా.కదలిరా.. ద్వారా చంద్రబాబునాయుడు ఎత్తి చూపిస్తున్నారన్నారు. టీడీపీకి ప్రజల మద్దతు ఎలా ఉందో చంద్రబాబు బహిరంగ సభలే నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపడానికి తెలుగు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని బీసీ పేర్కొన్నారు.

40 మంది ఎంపీడీవోలు రిలీవ్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 30: సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 40 ఎంపీడీవోలను రిలీవ్ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో జి.నాసర రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల సాధారణ ఎన్నికల ప్రక్రియను పురస్కరించుకుని ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 42 మంది ఎంపీడీవోలను అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు బదిలీ చేశారు. వీరిలో కర్నూలు ఎంపీడీవో ఆజాంఖాన్ ఆకస్మిక మృతి చెందారు. అదేవిధంగా జూపాడుబంగ్లా ఎంపీడీవో మంజులవాణి నంద్యాల డీపీఓ పని చేస్తుండటంతో ఇద్దరి బదిలీలు నిలిపివేశారు. మిగిలిన 40 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

సచివాలయంలో ఏసీబీ దాడులు

- వీఆర్వో, వీఆర్ఏలపై కేసు నమోదు
- పాసు పుస్తకాల కోసం రూ.10వేలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన హెచ్ కైరవాడి.రైతులు

గోనెగండ్ల, జనవరి 30: గోనెగండ్ల మండల పరిధిలోని హెచ్‌కైరవాడి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడులు చేశారు. వీఆర్వో రామకృష్ణ, వీఆర్‌ఏ(తలారి) మల్లేష్ రైతుల నుంచి లంచంగా డబ్బులు తీసుకుంటూ పట్టుబడ్డారు. హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన రంగస్వామి, హనుమంతు, శివశర్మ, విష్ణు, మహేష్‌లకు సర్వే నెంబరు 239/2, 240-5, 242లో 9.45 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం వారికి వారసత్వంగా వచ్చింది. అయితే వారి పొలాన్ని విభాగాలు చేసి అడంగల్ ఎక్కించి, పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు వీఆర్వో రామకృష్ణ రూ.10వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో హనుమంతు, రంగస్వామి కర్నూలులోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.



వీఆర్వో, వీఆర్ఏను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఏసీబీ అధికారులు పన్నిన పథకం ప్రకారం.. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు డబ్బులు ఇవ్వడానికి రైతులు సచివాలయం వెళ్లారు. తలారి మల్లేష్ ద్వారా రూ. 10 వేలు రామకృష్ణ తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, వంశానాథ్ పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి విలేకరులతో మాట్లాడుతూ వీఆర్వో రామకృష్ణ, తలారి మల్లేష్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అధికారులు పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే 14400 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

మంత్రాలయం, జనవరి 30: కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం గతంలో కన్నా ఎక్కువగా వచ్చింది. మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది, భక్తులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 2023 డిసెంబరు 28 నుంచి జనవరి 29 వరకు 33 రోజులకు సంబంధించి రూ.4,15,32,738 నగదుతో పాటు 3642 గ్రాముల వెండి, 44 గ్రాములు బంగారు, విదేశీ డాలర్లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. గతంలో హుండీ ఆదాయం రూ.4 కోట్లకు తక్కువగానే రాగా, ఈ ఏడాది 33 రోజులకు రూ.4.15 కోట్లు వచ్చిందని వారు చెప్పారు. శ్రీమఠం ఉద్యోగుల సమష్టి కృషి వల్లే మఠానికి హుండీ ఆదాయం పెరిగిందని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. సూపరింటెండెంట్ జేపీ స్వామి, ఆడిటర్ దత్తుస్వామి ఉన్నారు.



మంత్రాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

61 వసంతాల జాతీయ పక్షి

- ప్రకృతి సమతౌల్యాన్ని గుర్తించే అద్భుత కళ..
- 1963 జనవరి 31వ తేదిన జాతీయ పక్షిగా గుర్తింపు..
- 1972లో నెమళ్ల సంరక్షణకై వన్యప్రాణి ప్రత్యేక చట్టం
- నెమళ్ల ఆవాసానికి నల్లమల అనుకూలం



ఆత్మకూరు, జనవరి30: పక్షులు లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం చాలాకష్టం. వాటిలో నెమలి అందమైనది. అందుకే భారత ప్రభుత్వం నెమలిని జాతీయ పక్షిగా గుర్తించి సరిగ్గా 61 వసంతాలు పూర్తయ్యాయి. 1963 జనవరి 31వ తేదీన ప్రభుత్వం నెమలికి జాతీయ గుర్తింపునిచ్చి వాటి సంరక్షణ కోసం 1972లో వన్యప్రాణి విభాగంలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రత్యేకించి మనరాష్ట్రంలోని నల్లమల అడవుల్లోని నీలపు రంగు నెమలినే మన దేశం జాతీయ పక్షిగా ఎంపిక చేశారు. ప్రపంచ దేశాల్లో నాలుగు జాతుల నెమళ్లు పునరుత్పత్తి అవుతున్నాయి. వీటిలో నీలపు రంగు నెమళ్లు మనదేశంలోని పలు ప్రాంతాల్లో పునరుత్పత్తి అవుతున్నాయి. నెమలి సాధారణ జీవిత కాలం 15 సంవత్సరాలు. జంతు ప్రదర్శనశాలలో ఉండే నెమళ్లు సుమారు 23 సంవత్సరాలు జీవిస్తాయి. బాగా ఆరోగ్యంగా ఉన్న నెమలి దాదాపు 7.4అడుగుల పొడవు వుంటుంది. అలాగే ఒక్కో రెక్క సుమారు 86 సెంమీలు ఉంటుంది. సుమారు 4.5 నుంచి 5 కేజీల వరకు బరువు వుంటుంది. ప్రకృతిలో జరిగే మార్పులకు అనుగుణంగా తన పింఛాలను విప్పి నాట్యమాడుతుంది. నెమలికి ప్రకృతి సమతౌల్యాన్ని పసిగట్టే అద్భుతమైన కళ వుంటుంది. కుక్కల తర్వాత భూకంపాలను నెమళ్లే ముందుగా పసిగడతాయి. రైతులకు వ్యవసాయంలో మంచి మిత్రులుగా దోహదపడుతాయి. మన దేశంలో తగ్గిన నెమళ్ల పునరుత్పత్తి : ఆత్మకూరు డివిజన్ పరిధిలోని నల్లమల అటవీ సమీపంలో వున్న రుద్రకోడూరు వద్ద నెమళ్ల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని అప్పట్లో 'అటవీ అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు ఆ దిశగా పనులు సాగడం లేదు. ఇదిలావుంటే ఇటీవల కాలంలో నల్లమలలో నెమళ్ల ప్రత్యుత్పత్తి మెరుగుపడుతున్నట్లు తెలుస్తోంది. కొత్తపల్లి మండలంలోని సప్తనదీ సంగమేశ్వర క్షేత్ర సమీపంలోని కృష్ణానదీ తీర ప్రాంతాల్లో కూడా నెమళ్లు విస్తృతంగా సంచరిస్తుంటాయి. అలాగే కొలనుభారతి క్షేత్రం, శ్రీశైలం-నాగార్జునసాగర్ పెద్దపులి అభయారణ్యం మీదుగా వెళ్లే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి, వెలుగోడు రిజర్వాయర్ సమీపంలోని గాలేరువాగు పరిసర ప్రాంతాల్లో నెమళ్లు అధికంగా ఉన్నట్లు అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

నల్లమలలో నెమళ్ల మనుగడ ఆశాజనకం



నల్లమలలో నెమళ్ల మనుగడ ఆశాజనకంగా వుంది. ప్రత్యుత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. బైర్లూటి ఎకోటూరిజం పరిధిలోని సఫారీలో వెళ్లేటప్పుడు ఉదయం, సాయంత్రం వేళలో నెమళ్లు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి.

- అలాన్ చేంగ్ టెరాన్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్



ప్రాక్టికల్స్ పేరుతో దోపిడీ

- విద్యార్థుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు
- నాన్ జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్ పరీక్షలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 27,890 మంది విద్యార్థులు
- పరీక్షలకు 186 కేంద్రాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 30: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పేరుతో ప్రైవేట్ కళాశాలల యజమానులు విద్యార్థులను దోపిడీ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.1000 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే తక్కువ మార్కులు వస్తే తమకు సంబంధం లేదని విద్యార్థులను బెదిరిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో జరుగుతున్న ఈ దందాను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బైపీసీ, ఎంపీసీ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు మొత్తం 27,890 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 186 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ఫిబ్రవరి 5 నుంచి 20వ తేది వరకు ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. ఇంటర్మీడియట్ అధికారులు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంటర్ జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7వ తేది వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరీక్ష కేంద్రాలను గుర్తించి బోర్డు అధికారుల నుంచి అనుమతి పొందారు. ఇప్పటికే ఆయా కేంద్రాలను పరిశీలించి, ఏమైనా కొరత ఉంటే, సరిద్దిదుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు ఆర్ఐఓ సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 27,890 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 318 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 27,890 మంది ఉన్నారు. ఫిబ్రవరి 5 నుంచి జరిగే ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 5,767 మంది హాజరవుతున్నారు. ఈ విద్యార్థుల కోసం 42 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు 3,449 మంది కాగా, నంద్యాలకు చెందిన విద్యార్థులు 2,381 మంది ఉన్నారు. అలాగే, ఇంటర్ జనరల్ కోర్సు విద్యార్థులు 22,123 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 144 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 14,534 మంది ఉన్నారు. 92 కేంద్రాలను, నంద్యాల జిల్లాలో 7,589 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 52 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు.





ఫీజుల పేరుతో దందా

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షల ఫీజుతో పాటు ప్రాక్టికల్స్‌ను కలుపుకొని జనరల్ కోర్సు విద్యార్థులు రూ.560 + 250 మొత్తం కలిపి రూ.810 ఒక్కో విద్యార్థి చెల్లించాలి. అలాగే, ఒకేషనల్ కోర్సు ప్రథమ సంవత్సరం విద్యార్థులు బ్రిడ్జి కోర్సుతో రూ.1450 చెల్లించాలి. అలాగే, రెండో సంవత్సరం విద్యారులు రూ.1800 చెల్లించాలి. ఈ మొత్తానికి ఆదనంగా రూ.1000 నుంచి రూ.1500 వరకు ప్రైవేట్ కళాశాలల యజమానులు వసూలు చేస్తున్నారు. కళాశాలలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించకుండా పరీక్షలప్పుడు భారీగా డబ్బులు వసూలు చేయడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల యజమాన్యాలు విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఎక్కడైనా అదనంగా వసూలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిస్తే ఆ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

\- ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, ఆర్ఐవో

మహిళ ఆత్మహత్య

మూడు రోజుల క్రితం సహచరుడి మృతితో..



అంపమ్మ (ఫైల్)

కోసిగి, జనవరి 30: కోసిగిలోని సజ్జలగూడెం రోడ్డులోని సిద్దప్పపాలెం శ్మశానవాటికలో అంపమ్మ (33) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన అంపమ్మకు, హాల్వి గ్రామానికి చెందిన రమేష్‌కు 15 ఏళ్ల క్రితమే వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే.. అంప మ్మ ఆరు సంవత్సరాల కింద భర్త నుంచి విడిపోయి పుట్టినిల్లు అయిన వల్లూరు గ్రామంలో ఉంటోంది. పిల్లలు మాత్రం భర్త రమేష్ దగ్గర ఉంటు న్నారు. గత కొంత కాలంగా కోసిగిలోని 9వ వార్డుకు చెందిన రాముడుతో ఆమె సహజీవనం చేస్తోంది. రాముడు మూడు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం సిద్దప్పపాలెం శ్మశాన వాటికలో సమాధి దగ్గర పురుగుల మందు తాగి అంపమ్మ విగతజీవిగా కనిపించింది. ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సహచరుడు రాముడి మృతిని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతురాలి తల్లి అమరమ్మ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదే హాన్ని తీసికెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అనాథ శవంగా అంత్యక్రియలు నిర్వహించినట్లు కోసిగి పోలీసులు తెలిపారు.

క్యాన్సర్ హాస్పిటల్స్‌కు నర్సింగ్ సూపరింటెండెంట్లు



పదోన్నతి పొందిన వారికి క్యాప్‌లను పెడుతున్న నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 తులసమ్మ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 30: స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా జి.అనుసూయ, కె.రాజ్యలక్ష్మి నియమితుల య్యారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మంగళవారం ఇద్దరిని జాయిన్ చేసుకున్నారు. తాత్కాలికంగా ఆసుపత్రిలోనే విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకట తులసమ్మ కొత్తగా పదోన్నతులు పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గ్రేడ్-2లకు క్యాప్‌లను పెట్టారు. అనంతరం వారికి పలువురు హెడ్ నర్సులు అభినందనలు తెలిపారు. కొత్తగా ఏర్పాటు కానున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా ఇద్దరు బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు కె.ఉమాదేవి, ఎం.లీల, విమల, ఎంఎస్ రమణమ్మ, ఆదిలక్ష్మి, జి.ఉమాదేవి, ఎం.లీలావతి పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 30: టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పు సీఎం జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు అని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నా రు. మంగళవారం మండ లంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంప పెట్టు లాంటిదన్నారు. సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్ రెడ్డి వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. అక్రమ కేసులు పెట్టి వాటిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని జగన్ రెడ్డి చూస్తున్నారనీ అన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని విడిచిపెడుతున్నారన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, బజారు, వేణు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం రెస్టారెంట్ల టెండరుకు దరఖాస్తులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 30: ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన టూరిజం రెస్టారెంట్లను టెండరు ద్వారా లీజుకు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకేసుల డ్యామ్ వద్ద నిర్మాణ దశలో నిలిచిపోయిన రెస్టారెంటు, ఓర్వకల్లు మండలం కేతవరం వద్ద నిర్మించిన రెస్టారెంటు, ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన రెస్టారెంట్లను 20 సంవత్సరాల లీజుకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన రెస్టారెంటును పూర్తిగా అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు కల్పించుకోవాలని ఆమె తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో జిల్లా పర్యాటక అండ్ సాంస్కృతిక అధికారి కార్యాలయంలో టెండరు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 6309942034, 8247704152 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జనవరి 30: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో రెండో సెమిస్టర్‌లో 107కుగాను 52 మంది ఉత్తీర్ణత సాధించారు. 4వ సెమిస్టర్‌లో 70కి 59 మంది, సప్లిమెంటరీలో 2వ సెమిస్టర్‌లో 35 మందికి 31. 4వసెమిస్టర్‌లో 24 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

5 నాటికి పనులు పూర్తి చేయండి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 30: ఫిబ్రవరి 5వ తేది నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ ఉన్న మౌలిక సదుపాయాలను తర్వితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన సదుపాయాలపై సంబంధిత శాఖలు చేస్తున్న పనులపై ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ



స్ట్రాంగ్‌రూం, కౌటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు, జనవరి 30: సాధారణ ఎన్నికల నేపథ్యంలో భాగంగా రాయలసీమ యూనివర్శిటీలో స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ నగర శివారులోని రాయలసీమ యూనివర్శిటీలో పర్యటించారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరిచే గదులు, కౌంటింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సాధారణ ఎన్నికల్లో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. కల్లూరు తహసీల్దారు టివి. రమేష్‌బాబు హాజరయ్యారు.

దిశా వన్ స్టాఫ్ సెంటర్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జనవరి 30: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని దిశా వన్ స్టాఫ్ కేంద్రం, మానసిక వికలాంగుల వార్డును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు మంగళ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులకు లీగల్ సర్వీసెస్ చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని అందించడానికి అర్హులని తెలిపారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి అక్కడ ఉంటున్న వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో మానసిక వైద్యుడు డా.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సాంకేతిక ఫలాలు రైతులకు దక్కాలి

రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు(అర్బన్), జనవరి 30: సాంకేతిక ఫలాలు సాధారణ రైతులకు దక్కాలని రాయలసీమ యూనివర్సిటీ సుధీర్ ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. మంగళవారం వర్సిటీలోని సెనెట్‌హాలులో 'రాష్ట్ర అభివృద్ధి-సాంకేతికత' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విత్తనం నాటే దశ నుంచి పండిన పంటను మంచి ధరకు విక్రయించే వరకు రైతుకు అన్నివిధాలా లాభం చేకూరాలన్నారు. అందుకోసం రైతులు ప్రభుత్వ అందిస్తున్న సేవలతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను అందిపుచ్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు లోకానందరెడ్డి, అజీమ్ ప్రేమ్‌జీ, టి.వెంకట సాయిశశిధర్, రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చా, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదు కిడ్నాప్ కేసులో కర్నూలు ఎస్ఐ ప్రమేయం

- ఎస్ఐ కోసం పోలీసుల గాలింపు
- పరారీలో నిందితుడు

కర్నూలు, జనవరి 30: హైదరాబాదులోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన కిడ్నాప్ కేసుల్లో కర్నూలు పని చేస్తున్న ఎస్ఐ సృజన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. సృజన్ డీఐజీ కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాదులోని ఏజేఏ యాడ్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎండీ సుగుణాకర శెట్టిని బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశాడు. రంజిత్ అనే మాజీ పోలీసు అధికారితో కలిసి సృజన్, మరికొంతమంది ఏజేఏ యాడ్స్ సాఫ్ట్‌వేర్ కంపె నీకి ఏపీ సీఐడీ పోలీసులను అని చెప్పి తనిఖీ చేయాలని బెదిరించారు. తనిఖీలు ఆపాలంటే ఖర్చు అవుతుందని, బేరాలు మొదలు పెట్టి రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులుగా ఉన్నారు. పోలీసులు 9 మందిని అరెస్టు చేయగా.. సృజన్ పరారీలో ఉన్నాడు. సృజన్ 2009 బ్యాచ్‌కు చెందిన ఆర్ఎస్ఐ. 2012లో సివిల్ ఎస్ఐగా వచ్చాడు. కర్నూలు జిల్లాలో సి.బెళగల్, కర్నూలు ట్రాఫిక్, ట్రాన్స్‌కో, సీఐడీ విభాగాల్లో పని చేశాడు. ప్రస్తుతం డీఐజీ కార్యాలయంలో ఉన్నారు. 9 మంది నిందితుల్లో కర్నూలు బీ.క్యాంపు బిషప్ చర్చి ప్రాంతానికి చెందిన సందీప్ కుమార్ సూడో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీఐడీగా వ్యవహరించాడు.

ఇద్దరు వన్యప్రాణి వేటగాళ్ల అరెస్టు



అటవీ అధికారులకు చిక్కిన చుక్కల దుప్పిని హతమార్చిన నిందితులు

ఆత్మకూరు, జనవరి 30: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో విద్యుత్‌షాక్ ద్వారా వన్యప్రాణులను వేటాడుతున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి మాట్లాడుతూ.. ఈనెల 29న సోమవారం చిన్నగుమ్మడాపురం గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య, ఎర్రమఠం గ్రామానికి చెందిన వరదన సామేలుతో పాటు పులిచర్ల మూగన్న అనే వ్యక్తులు కరెంట్ తీగలను ఏర్పాటు చేసి చుక్కల దుప్పిని హతమార్చారన్నారు. ఈ ఘటనపై తమకు సమాచారం రావడంతో నిందితులను పట్టుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. వీరిలో చిన్నపుల్లన్న, సామేలును అదుపులోకి తీసుకోవడంతో పాటు కిలో చుక్కల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు మూగన్న అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. నిందితులను మంగళవారం ఆత్మకూరు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌ఓ నాగేశ్వరరావు, ఎఫ్‌బీవో పాములేటి, స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రొటెక్షన్ వాచర్లు, యాంటి పోచింగ్ సిబ్బంది ఉన్నట్లు చెప్పారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



31వ వార్డు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న గౌరు చరిత

కల్లూరు, జనవరి 30: సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నాయని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31వ వార్డు శరీన్‌నగర్ నాయీ బ్రాహ్మణ కాలనీలో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూ రిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆమె ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పం పిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటి షన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నంది కొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ శైలజాయాదవ్, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభా కర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాదేష్, వంగాల జనార్థన్‌రెడ్డి, ఆదం, మల్లికార్జున, రామకృష్ణ, క్రిష్ణన్న, సువర్ణ, రేణుక, కల్లూరు మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎస్వీ.రామకృష్ణ, జె.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్ గౌడ్, పీయూ మాదన్న పాల్గొన్నారు.

- **సర్పంచులకు గౌరు మద్దతు:** తమ డిమాండ్లను పరిష్క రించాలని కోరుతూ సర్పంచ్‌లు ధర్నా చౌక్‌వద్ద చేపట్టిన నిరసనకు టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మద్దతు తెలిపారు.

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం: బుడ్డా



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరుతున్న బైరి ఓంకార్ తదితరులు

బండిఆత్మకూరు, జనవరి 30: టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కడమలకాల్వ గ్రామంలో మంగళవారం ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి ఓంకార్‌తో పాటు పలు కుటుంబాలు వైసీపీని వీడి బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఆపుకోవాలని సవాల్ విసిరారు. ఒక్కసారి అని మోసం చేసిన జగన్‌ను మరోసారి నమ్మవద్దని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో అభివృద్ధికి మారు పేరైన టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే శిల్పావి మాటలే గొప్పవని, చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమని ఆరోపించారు. ప్రజల్ని మోసం చేసి తన వ్యాపారాలు మాత్రం బాగా చేసుకోవటం అయనకు బాగా తెలుసునన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు భరద్వాజ శర్మ, సొసైటీ మాజీ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, మదన్ భూపాల్, బలరాముడు, బుగ్గరాముడు, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, శివయ్య, శీను, రామకృష్ణ, లాయర్ కృష్ణారెడ్డి, లక్ష్మీరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రతాప్, సురేష్, జాకీర్, గోవింద్, తిరుపాల్ పాల్గొన్నారు.

'మాదాసి కురువలుగా నమోదు చేయాలి'



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న మాదాసి కురువలు

పగిడ్యాల, జనవరి 30: కులగణన సర్వేలో కురువలను మదాసి కురువగా నమోదు చేయాలని, అలా చేయకపోతే కులగణన సర్వేను బహిష్కరిస్తామని మదాసి కరువలు హెచ్చరించారు. సర్వేలో మదాసి కురువలుగా నమోదు చేయాలని కోరుతూ పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన సర్పంచ్ ఆంజనేయులు, మదాసి కురువ బాలరాజు, నాగేషన్న, ఎల్లయ్య, మల్లయ్యలు పంచాయతీ కార్యదర్శి జామిద్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. మదాసి కురువలుగా నమోదు చేయకపోతే సర్వేలలో ఎవరూ నమోదు చేయించుకోరని చెప్పారు.

'ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'



ధర్నా చేస్తున్న చెంచులు

జూపాడుబంగ్లా, జనవరి 30: మండలంలోని 80బన్నూరు చెంచు కుటుంబాలకు జూపాడుబంగ్లాలో ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండు చేస్తూ చెంచులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. చెంచులకు సీపీఐ నాయకులు మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట చెంచు కుటుంబాలకు ఒక్కో సెంటు మాత్రమే ఇచ్చారని, కుటుంబాలు పెరిగాయని ప్రస్తుతం ఉండటానికి ఇంటిస్థలాలు కేటాయించి పక్కాగృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి ఐదెకరాల పొలం ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్నకు వినతిపత్రం అందజేశారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న ఎస్ఎండీ రఫీ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 30: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కాలేజీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి రఫీ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 5 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతున్న క్రమంలో ఈ తతంగానికి ప్రైవేట్ జూనియర్ కాలేజీలు తెరలేపాయన్నారు. ఇతర కళాశాల నుంచి పరీక్షల పరిశీలనకు వచ్చే అధికారికి డబ్బులు ఇవ్వాలని, అలా చేస్తేనే ఎక్కువ మార్కులు వేస్తారని ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1500నుంచి 2వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో షాహీద్, బాలాజీ, రవితేజ, కళ్యాణ్, కిరణ్, పవన్‌కళ్యాణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

'వన్యప్రాణుల సంరక్షణకే పశువులకు టీకాలు'



టీకా వేస్తున్న అటవీ, పశు వైద్యాధికారులు

పాణ్యం, జనవరి 30: అటవీ సమీపంలోని వన్యప్రాణుల సంరక్షణ కోసమే సమీప గ్రామాలలోని పశువులకు టీకా వేస్తున్నట్లు ఎఫ్ఆర్వో సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం గోరుకల్లులో అటవీశాఖ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అటవీ సమీపంలోని వన్యప్రాణులకు గ్రామాలలోని పశువుల వ్యాధులు సంక్రమించకుండా ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రహాసన్, ఎఫ్‌బీవో జమాల్‌వలి, ఎంపీటీసీ గణేష్, ఏడీ కమలాకర్, డాక్టర్ సులోచన, సర్పంచ్ హుశేన్‌బాషా, సూర్యనారాయణరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

'డిజిటల్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి'

పాణ్యం, జనవరి 30: డిజిటల్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం సూచించారు. డిజిటల్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిజిటల్ మోసాలను ఎదుర్కోవడానికే డార్క్ ప్యాటర్న్స్ బస్టర్ హ్యాక్‌థాన్ పద్దతులు ఉన్నాయని చెప్పారు. ఐఐటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ (వారణాశి) దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డార్క్ ప్యాటర్న్స్ బస్టర్ హ్యాక్ థాన్ కు సంబంధించిన ఇంటర్నల్ హ్యాక్ థాన్ రెండవ రౌండ్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కోఆర్డినేటర్ షర్మిలాదేవి, హెచ్‌వోడీ డాక్టర్ ఫరూక్, డీన్ సౌమ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



నంద్యాలలో గాంధీ, కొవిడ్‌లో అమరులైన వైద్యుల చిత్ర పటాల వద్ద నివాళి అర్పిస్తున్న ఐఎంఏ సభ్యులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 30: కొవిడ్ బారిన పడిన ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ కరోనా బారిన పడి మృతిచెందిన వైద్యులు, అలాగే గాంధీకి నివాళి అర్పించారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ ఐఎంఏ పిలుపు మేరకు నిర్వహిస్తున్న జాతీయ అమర వీరుల దినోత్సవం నంద్యాలలోని ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి, కరోనా సమయంలో అమరులైన వైద్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఐఎంఏ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డా.రవికృష్ణ మాట్లాడుతూ కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలు పణంగా పెట్టి లక్షలాది ప్రజల ప్రాణాలు కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలో దేశంలో 2వేల మంది, రాష్ట్రంలో 122మంది వైద్యులు కొవిడ్‌తో ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రాణాలు కోల్పోయినవారిలో ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షుడు కేకే అగర్వాల్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు డా.పుట్టూరి గంగాధర్‌రావు, నంద్యాల ప్రాంతానికి చెందిన డా.సంజీవరెడ్డి, డా.శ్రీరామవెంకటరావు, డా.నాగేశ్వరరావు ఉన్నారని, వారి సేవలను గుర్తు చేసుకుంటూ నివాళి అర్పించారు. రవికృష్ణ మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి వైద్యసేవలు అందిస్తున్న వైద్యులపై కొన్ని సందర్భాల్లో రోగుల బంధువులు దాడులు చేయడం, హింసాత్మక ఘటనలకు పాల్పడటం శోచనీయమని, వైద్యుల రక్షణ చట్టాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్లు వసుధారాణి, పనిల్‌కుమార్, మధుసూదన్‌రావు, మధుసూదన్‌రెడ్డి, భార్గవవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి, జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కొవిడ్ అమర వైద్యులకు నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఫలాలను అందించే విధంగా పోరాటాలు చేసిన గాంధీజీ సేవలు అజరామరమని, కొవిడ్‌లో మృతిచెందిన వైద్యుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి డా.రవికృష్ణ, కళారాధన, లయన్స్‌క్లబ్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో గాంధీ విగ్రహం వద్ద నివాళి



నందికొట్కూరులో..

నందికొట్కూరు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని మహాత్ముడి దంపతుల విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయన మాట్లాడుతూ బాపూజీ కలలుగన్న స్వరాజ్యం కోసం మనమందరం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. వారితో పాటు, వైస్ చైర్మన్, మున్సిపాల్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులో మంగళవారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు.

సుప్రీం తీర్పు జగన్‌కు చెంపపెట్టు: టీడీపీ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 30: చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి జగన్‌కు చెంప పెట్టులాంటిదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫరూక్‌తోపాటు టీడీపీ సీనియర్ నాయకుడు, ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి టీడీపీ రూపొందించిన మినీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



నంద్యాలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎన్ఎండీ ఫరూక్, ఏవీ సుబ్బారెడ్డి

వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత: మాండ్ర

నందికొట్కూరు రూరల్ జనవరి 30: వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని శివానందరెడ్డి నివాసంలో మంగళవారం మిడుతూరు మండలంలోని పీరుసాహెబ్ పేట వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు రెడ్డివారి సోమసుందర్ రెడ్డి, పుల్లారెడ్డి, గుండం రమణారెడ్డి, బాబుసాహెబ్, రవీంద్రబాబు ఆధ్వర్యంలో మాండ్ర, గౌరు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నాయకులు నాగలూటి మాజీ ఎంపీటీసీ దండుగల కృష్ణ, దంగుల శ్రీకాంత్, సుబ్రమణ్యం, లక్ష్మన్న, కృష్ణ, ఎల్లనాగన్న, మధుమోహన్, ఎల్లశేఖర్, వెంకటేశ్వర్లు, వడ్డె కృష్ణయ్యతో పాటు మరికొందరు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్(అర్లపాడు) గ్రామ వైసీపీ నాయకులు రామ మద్దిలేటి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గోపాలు, వెంకటరాముడు, మధు, సుబ్బయ్య, మండ్ల మధు, పెద్దమద్ది లేటి, వివనాయుడు, శివ, తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

● సుప్రీం కోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం అల్లూరు గ్రామంలో సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధినేతచంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందని అన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ ను రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందని చెప్పారు. వైసీపీ పై అసంతృప్తితో ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఆ పార్టీని వీడుతున్నారని అన్నారు. టీడీపీ హామీలతో ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని అంతేగాక చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ వస్తున్నారన్నారని అన్నారు. గిరీశ్వర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, భాస్కరెడ్డి, ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు గ్రామంలో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పీర్‌సాహెబ్ పేట వైసీపీ నాయకులు

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి'



జిల్లెల్ల గ్రామంలో మట్టి నమూనాను సేకరిస్తున్న శాస్త్రవేత్త

గోస్పాడు, జనవరి 30: భూ సంరక్షణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మి సూచించారు. మంగళవారం డాక్టర్ ధనలక్ష్మితో పాటు సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు, తదితరుల బృందం సభ్యులు జిల్లెల్ల గ్రామంలోని పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పొలాల్లోని మట్టి నమూనా పరీక్షా ఫలితాలకు అనుగుణంగా సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. సేకరించిన మట్టిని పూర్తి స్థాయిలో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. భూమిలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు, మేలు జాతి పోషక విలువలు ఉన్న సూక్ష్మ జీవులను తెలుసుకోనున్నట్లు చెప్పారు. ఆయా ఫలితాల ఆధారంగా ఆ భూముల్లో ఏఏ పంటలు సాగుకు అనుకూలం అనే విషయాన్ని రైతులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. భూమిని సంరక్షించుకోవడం వల్ల భూమిని కాపాడుకోవడమే కాకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన వారమవుతామన్నారు. కేవలం పంటల సాగుపైనే కాకుండా అనుబంధ వ్యవసాయ రంగాలైన పాడి, పెరిటి కోళ్ళ పెంపకం, గొర్రెలు, పొట్టేళ్ళ పెంపకం లాంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించి రైతులు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని సూచించారు.

రాష్ట్రానికి అన్యాయం: సీపీఎం

ఆత్మకూరు, జనవరి 30: బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిళ్లు పూర్తయినప్పటికీ ఏపీకి అన్యాయం జరుగుతూనే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం, సీనియర్ నాయకుడు రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో 2014 ఎన్నికల ముందు ఏపీకి ప్రత్యేక హోదాను కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మభ్యపెట్టి సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. వెనకబడిన ప్రాంతాలకు, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వలేదని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో ఆపార్టీ నాయకులు రణధీర్, రజాక్, సురేంద్ర, ఇస్మాయిల్, రామ్‌నాయక్, స్వాములు, దినేష్ తదితరులు ఉన్నారు.

యువతను మోసగించిన జగన్

● నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ నిరుద్యోగ యువతన మోసగించారని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో నరసింహ మాట్లాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనకు, ప్రస్తుత జగన్ పాలనకు పోలికేలేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు ఆకాశానికి, పాతాళానికి మధ్య ఉన్నంత తేడా ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 50 లక్షల మంది విద్యార్థులకు వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారని, జగన్ ప్రభుత్వంలో 19 లక్షల మంది యువత నిరుద్యోగులుగా మారారని విమర్శించారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ హామీ అడ్రస్‌లేకుండా పోయిందని అన్నారు. మూడు రాజధానులు అని అంటూ ఏపీకి రాజధాని లేకుండా చేశారని, ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని నిలదీయలేని స్థితిలో వైసీపీ ఎంపీలు చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఒక్క రోజు కూడా పోరాటం చేయలేదని విమర్శించారు. వైఎస్ షర్మిల పర్యటన నేపథ్యంలో స్వాగత ఏర్పాట్ల బ్యానర్లు చించి వేయడం దారుణమని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యంలో తాగునీటి సమస్య



గడ్డంపేటలో నీటిని పట్టుకుంటున్న యువకులు

పాణ్యం, జనవరి 30: పాణ్యం గ్రామంలో తాగునీటి ఇబ్బందులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 6వ వార్డు నుంచి నుంచి 11 వార్డుల్లో ఉదయం నుంచి తాగునీరు అందకపోవడంతో గ్రామస్థులు మంగళవారం రాత్రి గడ్డంపేటకు వెళ్లి నీరుతెచ్చుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రచ్చవీధి, చాకలిపేట, సుంకులమ్మవీధి తదితర ప్రాంతాల వాసులకు నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. తాగునీరు అందకపోవడంతో పంచాయతీ అధికారులు ఎటువంటి తాత్కాలిక చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు ఆరోపించారు. ట్యాంకర్లు ఏర్పాటు చేయకపోవడంతో మోటారు సైకిళ్ల, సైకిళ్లపై నీరు తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బాలాంజనేయులును వివరణ కోరగా తాగునీటి పైపులైను పగిలిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బుధవారం నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామన్నారు.

'వచ్చేది టీడీపీ ప్రభుత్వమే'



ఎర్రమటంలో పాల్గొన్న టీడీపీ నాయకులు జయసూర్య తదితరులు

కొత్తపల్లి, జనవరి 30: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీయేనని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయసూర్య అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ఎర్రమఠం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో కర పత్రాలు పంపిణీ చేశారు. జయసూర్య మాట్లాడుతూ జగన్ పాలనలో మోసపోయిన ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు అక్రమ ఇసుక తవ్వకాల్లో వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును గెలిపించుకుని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. మాజీ కన్వీనర్లు జడ్. వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సీలం లింగన్న, డీలర్ వెంకటస్వామి, పరమేశ్వరరెడ్డి, జహరుల్లా, బుచ్చిరెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, మాదుగుల శేఖర్, మారెన్న, జానాల సుధాకర్, సుబ్బయ్య, రాజు తదితరులు ఉన్నారు.

'బదిలీ సహజం'



ఎంపీడీవో మేరీని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కొత్తపల్లి, జనవరి 30: ఏ ప్రభుత్వ అధికారికైనా బదిలీ సహజమని ఎంపీడీవో మేరి అన్నారు. ఎంపీడీవో మేరీ అనంతపురానికి బదిలీ అయ్యారు. మంగళవారం సాయంత్రం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఏవో సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఎంపీడీవో మేరికి వీడ్కోలు సభను ఏర్పాటు చేసి శాలువలు, పూలమాలలతో సన్మానించారు. ఎంఈవో శ్రీరాములు మాట్లాడుతూ మండలంలో ఏడాదిన్నర కాలం ఎంపీడీవో ప్రజలకు చేరువై సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఆమె కృషికి ఈ నెల 26న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బెస్టు అవార్డు, ప్రశంసాపత్రం అందుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారుల సహకారంతోనే తనకు బెస్టు అవార్డు లభించిందని, ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్ఏఈ రామచంద్రయ్య, ఏపీవో రేష్మా, ఈసీ శ్రీనివాసులు, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జనవరి 30: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జనవరి 30: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరర్ ఆర్గనైజేషన్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకస్తుతి, లింగాష్టకం, శివపంచాక్షరి, భో..శంభో, ఆనందతాండవం తదితర గీతాలకు లాస్య, కావ్య, శ్రీవల్లి, సహస్ర, హరిప్రియ, లక్ష్మీసహస్ర, తేజస్విని, సంకీర్తన తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజ స్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న నాయిబ్రాహ్మణులు

ఆత్మకూరు, జనవరి 30: ఆత్మకూరు పట్టణంలో నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పాత బస్టాండ్‌లోని శివాలయం నుంచి త్యాగరాజ స్వామి మందిర స్థలం వరకు మంగళవాయిద్యాలతో త్యాగరాజ స్వామివారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అలాగే కళాకారులకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల శివపాములేటి మాట్లాడుతూ వాయిద్య కళాకారులు కులదైవంగా భావించే త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలను జరుపుకొంటున్నట్లు తెలిపారు. ఇకనుంచి ప్రతిఏటా త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలను ఆత్మకూరులో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇకపోతే నాయిబ్రాహ్మణులు ఐక్యంగా మెలిగి త్యాగరాజ మందిరం నిర్మాణానికి కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, నాగన్న, రామకృష్ణ, మంగన్న, గోకారి, లక్ష్మీనారాయణ, ఎల్లప్ప, వెంకటేశ్వర్లు, పెద్దస్వాములు, గాలెన్న, అనిల్ కుమార్, రుద్రప్రసాద్, బోధనం సుబ్బరాయుడు, జనార్దన్, చంద్రశేఖర్, రమణ, సురేష్ తదితరులు ఉన్నారు.

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పాణ్యం, జనవరి 30: స్థానిక డొంగు సమీపంలో మంగళవారం ఆటోను ట్యాంకరు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవరు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. నంద్యాల నుంచి పాణ్యం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన డ్రైవరును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంపై విచారిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా, జనవరి 30: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఆమె తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని అన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె తెలిపారు.

2న త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం

శిరివెళ్ల, జనవరి 30 : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో సద్గురు త్యాగరాజ స్వామి 4వ ఆరాధన మహోత్సవ వేడుకలను ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని సీతారాముల దేవస్థానం నుంచి తాగ్యరాజ స్వామి మండపం వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ వాయిద్యకారులతో నాదస్వర కచేరి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నాయి బ్రాహ్మణ సేవా సంఘాల అధ్యక్షులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పల్స్ పోలియో కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి


గోవిందపల్లెలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ

శిరివెళ్ల, జనవరి 30 : చిన్నారుల్లో పోలియో నివారణకు త్వరలో చేపట్టనున్న పల్స్ పోలియో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని నంద్యాల జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ అధికారులను మంగళవారం ఆదేశించారు. మీజిల్స్, రుబెల్లా సేవలతో పాటు నవజాత శిశువులకు అందించే వైద్య సేవలను ఆశా కార్యకర్తలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గోవిందపల్లె గ్రామ సచివాలయం-2 పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల గురించి ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 510 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, పంచాయతీ కార్యదర్శి మనోహర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు

బేతంచెర్ల, జనవరి 30: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన తిక్క వెంకటేశ్వర్లు, డోన్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మంగళవారం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, దుర్గాపేట కాలనీవాసులు భాస్కర్, నడ్డి శ్రీనివాసులు, గర్ది మురళి, సుందర్‌రాజు, రమేష్ కోట్లమధు, ఆర్.శ్రీనివాసులు, అంబాపురం మధు, ఆవుల మధు, గర్జి మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

చాగలమర్రి, జనవరి 30: మండలంలోని శెట్టివీడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 300 మందికి మంగళవారం వివిధ వైద్య పరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యులు నాయబ్ రసూల్, అభిరాజ్, కంటి వైద్య నిపుణులు సౌజన్య, ముత్యాలపాడు వైద్యులు సుల్తాన వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, రాధిక, ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి స్వప్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

చాగలమర్రి, జనవరి 30: గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాల పనులను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ఈఈ హరిగోపాల్ అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలోగల జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2,303 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 723 గృహాలు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని సూచించారు. ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బంది కలిసి గృహాలు నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు వారి ఖాతాల్లో బిల్లులు జమ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షఫివుల్లా, ఉన్నారు.

గ్రామీణ వైద్యుల మహాసభ పోస్టర్ విడుదల

బనగానపల్లె, జనవరి 30: విజయవాడలో 4న జరిగే గ్రామీణ వైద్యుల పోస్టర్‌ను గ్రామీణ వైద్యుల సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్‌ను బనగానపల్లెలో విడుదల చేశారు. విజయవాడలోని అనుములు గార్డెన్స్‌లో నిర్వహించే సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు సైపుల్లా జిల్లా కార్యదర్శి సురేశ్‌బాబు బాలుడు, నాగరా జు, సుబ్బరాయుడు, సత్యనారాయణ, హుసేన్‌సాహెబ్, హనుమంతు, నాగమణి, అమీర్ బాషా, వెంకటేశ్వర్లు, ఖలీల్‌ఉర్ రహిమాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

బనగానపల్లె, జనవరి 30: పదోతరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని డోన్ డివిజన్ బీసీ సంక్షేమ హాస్టల్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి నరసయ్య సూచించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో మంగళవారం ప్రేరణా తరగతులను నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస ప్రేరకులు సురేశ్ మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా నిర్దేశించిన పరీక్షా సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన వాటికి ఆలస్యం చేయకుండా జవాబులు రాయాలని చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమసంఘం హాస్టల్ వెల్ఫేర్ అధికారులు వార్డెన్లు నాగేంద్ర, మేరీ, విద్యావతమ్మ, మునిరాజ్, మధు, ఇక్బాల్, వెంకన్నగౌడ్, చైతన్య లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

ఆళ్లగడ్డ, జనవరి 30: విద్యుత్ వినియోగంపై కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని విద్యుత్ ఏఈ హుసేన్‌బాషా మంగళవారం నిర్వహించారని ప్రిన్సిపాల్ రాజు చెప్పారు. వృత్తి విద్యలో బాగంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఎలా సరఫరా అవుతుందని, ఎలా వాడుకోవాలి, విద్యుత్ స్టేషన్‌లోని పరికరాల వివరాలను ఆయన విద్యార్థులకు వివరించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వృత్తి విద్య ఉపాధ్యాయుడు జయప్రకాష్, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

‘టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి’


మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ

దొర్నిపాడు, జనవరి 30: టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు బీఎస్ఆర్ గోడౌన్ ఆవరణలో మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అఖిలప్రియ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు చెందిన 30 పథకాలను రద్దు చేయడం జరిగిందని అన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధుల కింద రూ.75 వేల కోట్ల నిధులను దారి మళ్లించారన్నారు. టీడీపీతోనే బీసీల అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూమా సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, టీడీపీ నాయకులు చౌడయ్య, బాల ఉసేని, మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, చలుంగారి అమరేశ్వరయాదవ్, అంకన్న యాదవ్, అమ్మిరెడ్డినగర్ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, జోగి పుల్లయ్య, డీలర్లు రమణయ్య, హబీబ్‌బాషా ఉన్నారు.

● మండలంలోని చాకరాజువేముల గ్రామంలో టీడీపీ కార్యకర్త వడ్ల లాల్‌సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అక్కడకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భూమా కుటుంబం వెంటే ఉంటూ వచ్చాడని అన్నారు. లాల్‌సాహెబ్ మృతి బాధాకరం అన్నారు. కుటుంబానికి భూమా కుటుంబం అండగా ఉంటుందని అన్నారు.

తిరగబడేందుకు ప్రజలు సిద్ధం

రుద్రవరం: వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని, చంద్రబాబు నాయకత్వం వైపు రాష్ట్ర ప్రజల చూపు మళ్లిందని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్‌రెడ్డి పరిపాలన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎమ్మెల్యేలను మార్చడంలో ఆయనకున్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. 2024లో సీఎం చంద్రబాబునాయుడేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభద్రమ్మ, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లా మంచి చేయాలి

ఆళ్లగడ్డ: ఉమ్రా వెళ్తున్న ముస్లింలకు అల్లా మంచి చేయాలని మాజీ మంత్రి అఖిలప్రియ ఆకాంక్షించారు. పట్టణంలోని కొత్త మసీదు పేష్ ఇమామ్ హఫీజ్ నైముల్ల ఆధ్వర్యంలో ఈద్గా మసీదు నుంచి 40 మంది ఉమ్రాయాత్రకు మంగళవారం బయలు దేరారు. మాజీ మంత్రి అఖిలప్రియ పాల్గొని ముస్లిం మహిళలను సన్మానించారు. ఈమె వెంట కౌన్సిలర్ హుసేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్ కుట్రలకు చెంప పెట్టు

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి


కనపకుంట్లలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడి

డోన్, జనవరి 30: సీఎం జగన్ చేసిన కుట్ర రాజకీయాలతో టీడీపీ అధినేత చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంప పెట్టులాంటిదని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కనపకుంట్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులతో చంద్రబాబును దెబ్బతీయాలని సీఎం జగన్ చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు. చంద్రబాబు పై తప్పుడు కేసులు పెట్టారని సుప్రీం కోర్టు తీర్పుతో తేలిపోయిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలే సీఎం జగన్ అరాచక పాలనపై తిరుగుబాటు చేస్తున్నారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. టీడీపీ, జనసేన కూటమి తిరుగులేని విజయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ప్రజలే చర్చించుకుంటున్నారనీ అన్నారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టీడీపీ సలహాదారుల కమిటి అధ్యక్షులు మురళీకృష్ణగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, మన్నె వెంకటరమణారెడ్డి, ఎల్ఐసీ శ్రీరాములు, కమలాపురం రమేష్, మధుసూదన్‌రెడ్డి, గోవిందరెడ్డి, మైసూరా రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


ముత్యాలపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 30: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇండ్ల లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామమోహన్, డీఎం బాష తదితరులు పాల్గొన్నారు.

కాలచక్రంలో క్యాలెండర్ అవసరం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ, జనవరి 30: ప్రతి కాల చక్రంలో క్యాలెండర్ అవసరమని ఎంఈవో శోభావివేకవతి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వారి క్యాలెండర్‌ను సంస్థ అధ్యక్షుడు కన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎంఈవోగా డీఈవో సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నందుకు ఆమెను సంస్థ వారు శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాషా ఉపాధ్యాయులు ప్రవీణ్,జనార్దన్, రమేష్, వెంకటరమణ, హబిబుల్లా, నాగరాజు, రోహిణి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రీడా ఆణిముత్యాల కోసమే ఆడుదాం. .ఆంధ్ర


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి రోజా

ఆళ్లగడ్డ, జనవరి 30: క్రీడల్లో ఆణిముత్యాలను వెలికి తీసేందుకే , విద్యార్థులకు ఆడుదాం ఆంధ్ర పోటీలను సీఎం జగన్ నిర్వహిస్తున్నారని క్రీడల, టూరిజం మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి విద్యార్థుల్లో విద్యతో క్రీడలు ఎంతో అవసరమన్న ఆలోచనతో క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 15,004 సచివాలయాల్లో క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడా విజేతలకు రూ. 12 కోట్లు ఖర్చు చేసి బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, రాష్ట్ర క్రీడల చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మున్సిపాల్టి చైర్మన్ రామలింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా అన్నారు. యర్రగుడిదిన్నె గ్రామంలోని రాష్ట్ర జలవనరుల సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి స్వగృహానికి రోజా వచ్చి వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, బైరెడ్డి సిద్దార్థరెడ్డి పాల్గొన్నారు.

శిల్పకళ అద్భుతం

ఆళ్లగడ్డ, జనవరి 30: ఆళ్లగడ్డలో శిల్ప కళా సంపద అద్భుతమని మంత్రి రోజా కితాబు ఇచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పి రవీంద్రాచారి కుటుంబ సభ్యులు మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం ఇచ్చి మంగళవారం సాదరంగా ఆహ్వానించారు. శిల్ప కళా కేంద్రంలోని శిల్పాలను దర్శించిన ఆమె శిల్పుల నైపుణ్యాన్ని అభినందించారు.

రుద్రవరం మండలంలో ముగిసిన పార్వేటపల్లకి ఉత్సవం

రుద్రవరం, జనవరి 30 : మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో అహోబిళ లక్ష్మి నరసింహస్వామి కొలువుదీరిన పార్వేట పల్లకీ మొదటి విడత ఉత్సవం మంగళవారంతో ముగిసింది. పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు అర్చకుడు నిత్యకళ్యాణ రంగనాధన్ వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. గ్రామ పొలిమేరలో స్వామి ఉత్సవ పల్లకీకి వీడ్కోలు పలికారు. రుద్రవరం మండలంలో ముగిసిన మొదటి విడత ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ మండలంలోకి ప్రవేశించింది.

‘భూమా కిశోర్‌రెడ్డికే మా మద్దతు’


సమావేశంలో మాట్లాడుతున్న భూమా నారాయణరెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ, జనవరి 30: బీజేపీ సీనియర్ నాయకుడు భూమా కిశోర్ రెడ్డికి తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని విజయ పాల డెయిరీ మాజీ చైర్మన్ భూమా నారాయణ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలో భూమా కిశోర్‌రెడ్డితో పాటు భూమా నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. కిశోర్ రెడ్డికి తామంతా వెన్నంటే ఉంటామన్నారు. ఆయన గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. భూమా కిశోర్ రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తానని, టికెట్ రాకపోయినా బరిలో కచ్చితంగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాలో దివంగత భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలు ఏర్పాటు చేసిన బలమైన వర్గాన్ని భూమా అఖిల ప్రియ విచ్ఛిన్నం చేశారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో భూమా నారాయణరెడ్డి కుమార్తె దేవక్క, భూమా మహేశ్వరరెడ్డి, దొర్నిపాడు మాజీ జడ్పీటీసీ వీరభద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకరరెడ్డి, రాజారెడ్డి, హుసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించాలి


గోవిందపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు సిబ్బంది, ప్రజలు

శిరివెళ్ల, జనవరి 30 : కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో కుష్ఠు వ్యాధి నివారణపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో సేవలు అందిస్తామని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి సంతమార్కెట్‌లోని సచివాలయంలో స్పర్శ కుష్ఠువ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వైద్య సిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేశారు. కుష్ఠువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవుకు: కుష్ఠువ్యాధి పట్ల నిర్లక్ష్యం తగదుని ఉప్పలపాడు పాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వినోదకుమార్ డాక్టర్ యమున అన్నారు. .మంగళవారం అవుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో కుష్ఠు వ్యాధి నివారణపై గ్రామ ఉపసర్పంచ్ రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుష్ఠు వ్యాధి అవగాహన పోస్టర్లను విడుదలచేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వేణుగోపాలరాజు ఆశావర్కర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం గ్రామంలో స్పర్శ కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వైద్యాధికారి బాబు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

డోన్(రూరల్), జనవరి 30: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం ప్రాంగణంలో ప్రైవేటు స్కూళ్ల బస్సు డ్రైవర్లకు, యాజమాన్యాలకు బస్సు నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో బస్సుల ఫిట్‌నెస్, మెయింటెనెన్స్, రోడ్డు నియమాల గురించి అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు రైతు పరుగు కేక..

డోన్, జనవరి 30: డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో రైతు పరుగు కేక నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్ మంగళవారం తెలిపారు. టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఆర్డీవ కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు

బనగానపల్లె, జనవరి 30: బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలకు మంగళవారం రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షకులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. బనగానపల్లె మండలంలోని క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓటు వెరిఫికేసన్, ఎన్నికల నిర్వహణ, బూత్ క్లస్టర్ ఇన్‌చార్జిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బురానుద్దీన్, అమర్‌నాథరెడ్డి, నారాయణరెడ్డి, శంఖేశ్వర్‌రెడ్డి, యాగంటిపల్లె మహేశ్వరరెడ్డి, కాశింబాబు, రామతీర్థం మద్దిలేటి, అహమ్మద్‌హుసేన్; కైప రఘునాథరెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, సలాం, వల్లెపు శంకర్, అల్తాఫ్‌హుస్సేన్, మౌలాలి, అల్తాఫ్‌హుసేన్, వివిధ గ్రామాలకు చెందిన క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి


చాగలమర్రి గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


బనగానపల్లె కొత్త బస్టాండ్‌లో, గాంధీజీ విగ్రహం వద్ద...


డోన్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


కోవెలకుంట్లలో గాంధీ విగ్రహం వద్ద...


బేతంచెర్లలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, జనవరి 30: గాంధీ ఆశయాలు చిరస్మరణీయమని ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణబాబు అన్నారు. మంగళవారం చాగలమర్రి గాంధీ సెంటర్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మల్లికార్జున, నవతా ప్రసాద్, కృష్ణయ్య, చెంచు సుబ్బారావు, ఉదయ్, బాలకృష్ణ, రాజేష్, వెంకటనారాయణ, రంగనాథ్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్యాపిలి: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను నెరవేరుద్దామని టీడీపీ నాయకులు రామ్మోహన్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కోదండరాముడు, నాగేంద్ర, నరేంద్ర, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి ఉపాధ్యాయులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీభవన్ నుంచి ర్యాలీగా బయలు దేరి గాంధీజీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గాధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం అధిక సంఖ్యలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, లాయర్ నాగేంద్రరెడ్డి, యాగంటిపల్లె దస్తగిరి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు. పలుకూరు గ్రామంలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందారి ఆధ్వర్యంలో గాంధీవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాక్రమంలో పూజారి శ్రీనివాసులు, రాజు,రమనయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, వనితా క్లబ్ ఫౌండర్ విజయలక్ష్మి, వాసవి క్లబ్ అధ్యక్షుడు సుబ్బయ్య గుప్తా, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మధు సురేంద్ర, వనితా క్లబ్ అధ్యక్షురాలు సుభాషిణి, కార్యదర్శి ఇందుమతి పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని నరసాపురం గ్రామంలో సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో భాగంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం శాంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలో ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలు మంగళవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిశాల వద్ద ఉన్న గాంధీవిగ్రహం వద్దకు ఆర్యవైశ్యులు చేరుకొని గాంధీ విగ్రహానికి పూలంమాలలు వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు పెండేకంటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శిల్పాసుబ్రహ్మణ్యం, తాడేపల్లి గోపాల్, కర్నాటి వెంకటసుబ్బయ్య, కర్నాటి సుబ్రహ్మణ్యం, ఏ ఆనందబాబు, నవత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో మహ్మాతా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి విద్యార్థులు ర్యాలీగా ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా శివకుమార్, కంబయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.